ఎజెండా అంశాలకు ఆమోదం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: జగిత్యాల పట్టణాభివృద్ధే ధ్యేయమని, ఆ దిశగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. జగిత్యాల పట్టణాభివృద్ధి గతంలో కంటే మెరుగ్గా చేసుకున్నామని, మరిన్ని అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించామన్నారు. బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా బతుకమ్మ ఆడుకునే ప్రదేశాల్లో సౌకర్యాల కోసం, వివిధ ఏర్పాట్లకు 31.46 లక్షల నిధులు కేటాయించామని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. అలాగే మున్సిపాల్టీలో వీధి కుక్కల బెడద ఎక్కువ కావడంతో వాటిని నియంత్రించేందుకు ఎనిమల్ బర్త్ కంట్రోల్, యాంటి రేబీస్ ప్రోగ్రాం చేపట్టేందుకు రూ.70 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, బ్లేడ్ ట్రాక్టర్ గత వారం రోజులుగా పనిచేయడం లేదని, రూ.1500 కేటాయిస్తే ట్రాక్టర్ బాగవుతుందని, దానిని ఎందుకు చేయించడం లేదన్నారు. దానికి సంబంధించిన డ్రైవర్లు వృథాగా ఉంటున్నారని, వెంటనే బాగు చేయించాలన్నారు. వార్డుల్లో కార్మికులు తక్కువగా ఉన్నప్పటికీ కౌన్సిలర్లు ఇళ్లలో పనికి పెట్టుకుంటున్నారని కౌన్సిల్ సభ్యులు ఆరోపించారు. కొందరు ప్రజాప్రతినిధులు సమయం ముగిసినప్పటికీ వారి వద్ద సైతం కొనసాగుతున్నారని, ఇప్పటికైనా పారిశుధ్య కార్మికులను రిటర్న్ తెప్పించాలన్నారు. మొత్తం 14 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, డీఈ యాదగిరి, మేనేజర్ సాగర్, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, చరణ్‌తేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల బల్దియా సమావేశం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కోరుట్ల: కోరుట్ల మున్సిపాలిటీ అత్యవసర సర్వసభ్య సమావేశం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన జరిగింది. సభ్యులు పలు అంశాలను లేవనెత్తగా చైర్‌పర్సన్‌తోపాటు అధికారులు సమాధానమిచ్చారు. 15 ఏజెండా అంశాలను పొందుపరచగా.. 15 అంశాలకు మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. రెండు అంశాలపై 12 మంది కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ బట్టు తిరుపతి, టీపీవో ప్రవీణ్‌కుమార్, జేఏవో శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి మున్సిపల్..

గొల్లపల్లి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సత్తమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శానిటేషన్‌లో సున్నం బస్తాల కొనుగోలు, ఆటో ట్రైర్ల కొనుగోలు, పైప్‌లైన్ రిపేరు, గేట్‌వాల్స్ రిపేరు, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కొనుగోలు, ఆదాయ వ్యయాలు, ఇతర బిల్లుల చెల్లింపులు, 9 అంశాలను ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రికి పరామర్శ


మంత్రి ఉత్తమ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా, సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లో కలిసి పరామర్శించారు.

నివాళి

రాష్ట్ర పద్మనాయక వెల్మ సంక్షేమ మండలి ముఖ్య నాయకుడు సుద్దాల జగన్‌రావు గుండె పోటుతో మృతిచెందగా, సోమవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, సురేందర్‌రావు, నర్సింగరావు ఉన్నారు.

చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న అడ్లూరి

గొల్లపల్లి: మండల కేంద్రంలో రూ.3 లక్షల విలువ గల మూడు షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాదీముబారక్ నిరుపేద ముస్లింలకు వరమన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


కార్మికులకు మందులు అందిస్తున్న కమిషనర్

కోరుట్ల: మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా సపాయి మిత్ర సురక్ష సివిర్‌లో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్మికులకు వర్తించే పింఛన్ స్కీములు, ఆరోగ్యకార్డుల గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వైద్యాధికారి అనిల్, సూపర్‌వైజర్ ధనుంజయ్, అశోక్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి


విద్యార్థులకు ప్రశంసా పత్రం అందిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: విద్యార్థులు ప్రతి రంగంలో సృజనాత్మకత పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, విద్యయేతర కార్యక్రమాల్లోనూ రాణించాలని చెప్పారు. అనంతరం యువజనోత్సవాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ ఆలియా మక్సూద్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్: సహకార సంఘంలో రుణాలు తీసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ వస్తుందని సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ పొందిన 41 మంది సభ్యులకు కొత్తగా రూ.50 లక్షల రుణాలు అందజేశారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులందరికీ ఇప్పటికే రుణమాఫీ వర్తించిందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు అల్లాల రమేశ్‌రావు, బేతి రాజవ్వ, ముప్పారపు దేవమ్మ, నీలం లక్ష్మీ, తోట గంగరాజం, కొక్కుల శంకరయ్య, ఏలేటి రాజిరెడ్డి, సంఘ సీఈవో వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తిదాయకం


పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న ఏఎస్సై అలీబేగ్, హెడ్‌కానిస్టేబుల్ రాజయ్యను శాలువా, పులమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదన్నారు. అనంతరం పదవీవిరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అడిషనల్ ఏఆర్ ఎస్పీ భీమ్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, వేణు, సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘం ధ్యేయం


ఆర్థికసాయం అందిస్తున్న చైర్మన్ మల్లారెడ్డి

రాయికల్: రైతుల సంక్షేమమే సహకార సంఘం ధ్యేయమని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని సహకార సంఘం, అల్లీపూర్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023 సంవత్సరానికి గాను రూ.15.31 కోట్ల నికర లాభం సాధించిందన్నారు. సంఘంలో 9 మంది సభ్యులు ఇటీవల మృతిచెందగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.10 వేల ఆర్థికసాయం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీ మేనేజర్ మార్కండేయులు, అల్లీపూర్‌లో సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం

జగిత్యాలరూరల్: సమాజంలో ప్రతీ ఒక్కరు సమానమేనని జగిత్యాల రూరల్ ఎంపీవో రవిబాబు అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని, అన్ని వర్గాల వారు స్నేహభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. అంటరానితనం నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భూమయ్య, మాజీ సర్పంచ్ సత్తవ్వ, గంగారాం, మాజీ ఎంపీటీసీ భూమారెడ్డి పాల్గొన్నారు.

సిరికొండలో..

కథలాపూర్: మండలంలోని సిరికొండలో సోమవారం మండలాధికారుల ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఐకమత్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రాజశేఖర్, ఎంఈవో శ్రీనివాస్, ఆర్‌ఐ నాగేశ్, కార్యదర్శి నర్సారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అన్ని సామాజిక వర్గాలతో సమావేశం నిర్వహించి తేనీటి విందు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీవో, అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు



మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించుకున్నారు. బతుకమ్మలు పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆట ఆడారు. ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ప్రత్యేకంగా రంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈవోలకు సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇటీవల ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన మధును మండలకేంద్రంలోని కేజీబీవీలో సోమవారం ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్గటూర్: ఎండపల్లి ఎంఈవోగా నియమితులైన గుండేటి రామచంద్రంను ఎండపల్లి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రెస్‌క్లబ్ సభ్యులు గుల్లకోట ఎంపీపీఎస్ ఉపాధ్యాయ బృందం, అక్షర హైస్కూల్ యాజమాన్యం సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఐజేయూ సభ్యులు నల్లాల కుమార్, బాలసాని శ్రావణ్, నాగసముద్రాల శ్రీనివాస్, బొడ్డు రాజేశం,సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన గడ్డం సాయిచరణ్ రెడ్డి ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా, సోమవారం రాత్రి రైతు సంఘాల ప్రతినిధులు సన్మానించారు. సాయిచరణ్‌రెడ్డి సంగారెడ్డి పట్టణంలోని ఎంఎన్‌ఆర్ మెడికల్ కళాశాలలో ప్రభుత్వ కోటాలో సీటు సాధించారు.కార్యక్రమంలో సీడ్స్ ఆర్గనైజర్ గడ్డం భూమరెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో సోమవారం భగవద్గీతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్ లలిత, ఉపాధ్యాయులు, ఇస్కాన్ నిర్వాహకులు రమేశ్, చైతన్యదాస్, నర్సయ్య, బాలాజీ పాల్గొన్నారు.

ఆలయాల నిర్వహణ భక్త సమాజానికి అప్పగించాలి

జగిత్యాలటౌన్: ఆలయాల నిర్వహణను భక్త సమాజానికి అప్పగించాలని శ్రీజగదీశ్వరానందస్వామీజి, హారతి మాతాజీ డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్, హిందూధార్మిక సంస్థల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

గొల్లపల్లి: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. సోమవారం తపస్ ధర్మపురి మండలం ఆధ్వర్యంలో నేరెళ్ల, తుమ్మెనాల, రాయపట్నం గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు మహేశ్, పాల్గొన్నారు.

యావర్ రోడ్డులో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి

జగిత్యాలటౌన్: యావర్‌రోడ్డులో డ్రెయినేజీలు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నప్పటికీ పట్టించుకోని బల్దియా పాలకవర్గం కేవలం శునకాల బర్త్ కంట్రోల్ పేరిట రూ.70 లక్షలు జనరల్‌గా ఖర్చు పెట్టడమేంటని బీజేపీ ఫ్లోర్‌లీడర్ అనుమల్ల కృష్ణహరి ప్రశ్నించారు. సోమవారం జరిగిన బల్దియా సమావేశం అనంతరం మాట్లాడారు. పట్టణంలోని పలు వార్డుల్లో సరైన డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పాలకవర్గం మాత్రం ఇష్టారాజ్యంగా లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టడం ప్రజాసంక్షేమాన్ని విస్మరించడమేనన్నారు. ఇప్పటికైనా ప్రజల వాస్తవ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

జీవన భృతి మంజూరు చేయాలి

ఇబ్రహీంపట్నం: బీడీ పింఛన్లు మంజూరు చేయాలని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన 28 మంది బీడీ కార్మికులు ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ ప్రసాద్‌లకు దరఖాస్తులు అందచేశారు. ప్రభుత్వం నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తే అర్హత ఉన్నవారికి పింఛన్లను మంజూరు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో మధు, ఏపీఎం శంకర్, ఏవో రాజ్‌కుమార్, ఏపీవో కొమురయ్య పాల్గొన్నారు.

వంతెన మరమ్మతులకు నిధులు మంజూరు

సారంగాపూర్: బీర్‌పూర్ శివారుల్లోని ఎస్సారెస్పీ కాలువపై కూలిన వంతెనకు మరమ్మతుల కోసం సోమవారం రూ. 3.65 లక్షల నిధులు మంజూరైనట్లు ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్ తెలిపారు. బీర్‌పూర్ మండలం నుంచి ధర్మపురి మండలం వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై గతంలో ఎస్సారెస్పీ ఏర్పాటు చేసిన వంతెన ఇటీవల కూలిపోవడంతో రాకపోకలను దారి మళ్లించారు. రెండు రోజుల క్రితం వంతెన పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఈతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని కోరడంతో నిధులు మంజూరు కావడంతో ఈ పనులను టెండర్లు పిలిచారు. మరో రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. అధికారుల ఆదేశాలతో వంతెన వద్ద లష్కర్లు కూలిన రాళ్లను తొలగించే పనులు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం : రానున్న ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఓటర్ల నమోదుకు ఎన్నికల నోటిఫికేషన్‌ను తహసీల్దార్ కార్యాలయంలో నోటీసు బోర్డుపై ఉంచినట్లు తెలిపారు. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 6వ తేదీ వరకు అర్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

మేడిపల్లి: అక్టోబర్ 4న చలో కలెక్టరేట్ ముట్టడి రైతు ధర్నాను విజయవంతం చేయాలని రైతు ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి అన్నారు. ఉమ్మడి మేడిపల్లి మండలంలోని కాచారం, వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం, దేశాయిపేట,లింగంపేట్, మన్నెగూడెం, దమ్మన్నపేట, వల్లంపల్లి గ్రామాల్లో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఇచ్చిన పిలుపుకు జిల్లా వ్యాప్తంగా రైతులు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారని, ధర్నాకి ప్రతి గ్రామం నుండి రైతులు తరలిరావాలని కోరారు. రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలనే పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక నాయకులు పిడుగు సంధ్యన్న, వంగల వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, వంశీ, ఉమేశ్, మేడిపల్లి,భీమారం మండలాల అధ్యక్షులు చిలువేరి తిరుపతి యాదవ్, ఉదిగిరి ఆదిరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సారంగాపూర్: మండలంలోని నాయికపుగూడెం భీమన్న ఆలయంలో భక్తుల కోసం నిర్మించిన భవనానికి ఆనుకుని మర్రి వృక్షం ఉంది. దీని వేర్లు భవనం స్లాబ్ పైకి పాకుతున్నాయి. దీంతో స్లాబ్ బీటలు వారే పరిస్థితి నెలకొంది. ఈ భవనం విస్తరణ కోసం నిధుల మంజూరుకు ఎమ్మెల్సీ గిరిజనులకు హామీ ఇచ్చారు. కాగా స్లాబ్‌కు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, పంచాయతీ కార్యదర్శి,నాయకపుగూడెం సెల్: 9494907653

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మెట్‌పల్లిరూరల్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ విద్యార్థులు సత్తా చాటారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో చుక్క ధర్మరాజు మెమోరియల్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌-2024 కరాటే పోటీల్లో జేకేపీ ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ నుంచి బండలింగాపూర్‌కు చెందిన 19 మంది కరాటే విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. కటాస్ విభాగంలో ప్రథమస్థానంలో 7 బంగారు, ద్వితీయ స్థానంలో 6 వెండి, తృతీయ స్థానంలో 6 కాంస్య పతకాలు దక్కించుకున్నారు. విజేతలకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కరాటే శిక్షకుడు సుదర్శన్, చేతుల మీదుగా పతకాలు,ప్రశంసపత్రాలు అందజేశారు. విద్యార్థులను జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు మాస్టర్ ప్రవీణ్ అభినందించారు.

ఇబ్రహీంపట్నం: నిర్మల్ జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మండలకేంద్రానికి చెందిన నలుగురు కరాటే విద్యార్థులకు ప్రతిభ కనబర్చారు. కటాస్ విభాగంలో ద్వితీయ స్థానంలో ఎ.హృషికేస్, తృతీయ స్థానంలో బి.విగ్నేష్, కె.హర్షవర్ధన్, అర్పిత్‌లు కాంస్య పతకాలు సాధించారు. గెలుపొందిన వారికి తెలంగాణ కరాటే ప్రధాన శిక్షకుడు రాపోలు సుదర్శన్ పతకాలు, ప్రశంసా పత్రాలు అందచేసినట్లు జిల్లా కరాటే ప్రధాన శిక్షకుడు మాస్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల జగిత్యాలలో జరిగిన అండర్ 17 ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన శాన్వీ, లక్ష్యను సోమవారని పాఠశాల ప్రిన్సిపల్ సరితాదేవి అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ నగేశ్, పీడీ వినిత్, అజీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లి వాసవి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గడ్డం వరుణ్ సందేశ్ సోమవారం జగిత్యాల జిల్లాలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ క్రికెట్‌లో అండర్ -17 విభాగంలో జగిత్యాల జిల్లా తరపున సెలెక్ట్ అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ బొడ్ల సతీశ్ తెలిపారు.

విద్యార్థికి గాయాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలో టవర్‌సర్కిల్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఓ విద్యార్థి కాపీకి పాల్పడ్డాడని వాతలు వచ్చేలా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సదరు పాఠశాల యజమాన్యం తీవ్రంగా స్పందించి టీచర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఇకపై అలా జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వినతి

మేడిపల్లి: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ ఎంపీటీసీ మురపు గంగారాజం అన్నారు. సోమవారం మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామశివారులోని వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వాగు ప్రాంతంలో రెవెన్యూ సిబ్బంది ప్రత్యేకంగా తనిఖీలు చేస్తుండగా.. భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుంటే రెవెన్యూ సిబ్బంది పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆర్‌ఐ నాగేశ్ తెలిపారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా తిరుపతిగౌడ్

రాయికల్: మండలంలోని తాట్లవాయి గౌడ సంఘం అధ్యక్షుడిగా తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఒల్లాల శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా గడ్డం తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి మహేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా బుర్ర రమేశ్‌గౌడ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వయోవృద్ధులను గౌరవిద్దాం

రాయికల్: సమాజంలో వయోవృద్ధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. సోమవారం రాయికల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా వృద్ధులను సన్మానించారు. వయోవృద్ధుల సేవలను వివరించారు.

బతుకమ్మ వేడుకలపై సమావేశం

గొల్లపల్లి: ధర్మపురి పట్టణ గంగపుత్ర బోయవాడలో బొడ్డెమ్మ వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయవాడ నుంచి గోదావరి వరకు ఊరేగింపు తదితర ఉత్సవ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అపరిచితులు వస్తే సమాచారం ఇవ్వాలి

బుగ్గారం: గ్రామాల్లో ఆయుర్వేదిక్ మందులు ఇస్తామని, ఇంట్లో వాళ్ల అనారోగ్య సమస్యలు తీరుస్తామని, కేరళలో వైద్యం ఇప్పిస్తామని మాయమాటలు చెబుతూ డబ్బులు తీసుకుని మోసం చేసి పారిపోతున్న ఘటనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుగ్గారం పోలీస్ శాఖ తరపున తరపున ప్రజలకు తెలియజేశారు. ఎవరికి డబ్బులు పంపించవద్దని, ఎవరిని కూడా నమ్మవద్దని,ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఏకాగ్రతతో చదివినప్పుడే లక్ష్యసాధన

రాయికల్: విద్యార్థులు ఏకగ్రతతో చదివినప్పుడే అనుకున్న లక్ష్యం సాధిస్తారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుధీర్ అన్నారు. సోమవారం రాయికల్ మండలం భూపతిపూర్ పాఠశాలలో విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ నైతిక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణి, మాజీ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండ్ర్యాలలో బైక్ చోరీ

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన అబ్దుల్ హైమద్‌కు చెందిన బైక్ ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. హైమద్ ఈనెల 29న తాండ్ర్యాల ఎక్స్ రోడ్డులో హోటల్ వద్ద బైక్‌ను నిలిపి లోపలికి వెళ్లి, బయటకు వచ్చేసరికి బైక్ కనిపించలేదు. బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడు హైమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.